www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 31 మే 2025
5
అన్నమయ్య

'అన్నమయ్య' వరద బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, అన్నమయ్య జిల్లా సమన్వయకర్త అతికారి కృష్ణ, రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. శుక్రవారం వారు అన్నమయ్య డ్యాం వరద ప్రభావిత గ్రామాలైన తొగురుపేట, రామచంద్రాపురం, మందపల్లి, పులపుత్తూరు తదితర గ్రామాలలో పర్యటించారు. వరద బాధిత కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిష్కృత సమస్యలను జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేయాలన్నారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 'నేషనల్ నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్' జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి అజెండా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమా వేశంలో వివరించారు. ప్రధానంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో తీసుకోవాల్సిన అంశాలను కమిటీలో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కారాదని ముఖ్యంగా యువత మేలుకొని డ్రగ్స్ వదులుకోవాలని, తమ భవితను మంచిగా మలచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, విద్య, అటవీ, డ్రగ్ తదితర శాఖల అధికారులు అందరూ పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని రెవెన్యూ, మార్కెటింగ్, అటవీ, పోలీస్ అన్ని చెక్‌పోస్టులలో పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ కాలేజీల ప్రిన్సిపల్స్, ఎంఇఒలతో శిక్షణ అవగాహన కార్యక్రమాలు చేయాలని, అందరూ వైద్యాధికారులు, ఏరియా హాస్పిటల్స్, సిహెచ్‌సిలలో ఎవ్వరైనా మాదకద్రవ్యాల సేవించి ఎవరైనా వస్తే అలాంటి వారి వివరాలను పోలీసు శాఖకు అందజేయాలని సూచించారు. విఆర్ఒ, విఆర్ఏలకు గ్రామాలలో డ్రగ్స్ సేవిస్తున్న వారి వివరాలను తెలియజేసేలా తగు ఆదేశాలు జారీ చేయాలని సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలకు సూచించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి చెప్పేలా ప్రజలలో అవగాహన కలిగించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించాలన్నారు. ఎండిపిఎస్ చట్టం యొక్క నిబంధనలపై, మాదక ద్రవ్యాల హానికరమైన ప్రభావాలపై అక్రమ సాగుచే ప్రభావితమైన ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, జిల్లాలో డ్రగ్ డి-అడిక్షన్, పునరావాస కేంద్రాల పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి డివిజన్లలో 2024, 2025లో ఇప్పటి వరకు మొత్తం 26 డ్రగ్ కేసులను రిజిస్టర్ చేసి సుమారు 300 కిలోల గంజాయి పట్టుకున్నామని, 40 మంది నిందితులను గుర్తించామన్నారు.

ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, ఎఎస్‌పి, ఎక్సైజ్ అధికారులు

11 మంది రిపీటెడ్లు, 20 మంది సెల్లర్స్, 99 మంది వినియోగదారులను గుర్తించి కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా గురించి సమాచారం సేకరించి, జిల్లాలో గంజాయి లేదా గంజాయి పంట అక్రమ సాగుపై పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు అయిన గంజాయి, మార్ఫిన్, హెరాయిన్, కొకైన్, నల్లమందుల వినియోగం ఇటీవల కాలంలో పెరుగుతోందన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాల రవాణా, వినియోగం చేసినచో ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని కళాశాలలో పోలీస్ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని కళాశాలల్లో, స్కూల్లలో 167 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వివిధ కూడళ్లలో హోర్డింగ్స్, ప్రచార పోస్టర్లు, కరపత్రాలు, పాంప్లెట్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అన్ని చెక్ పోస్టులలో నిఘా ఏర్పరచినట్టు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్లు 1972, 1933 లేదా 7382296118కు ఎవరైనా ఫోన్ చేసి సమాచారం తెలపవచ్చునన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. వివిధ అంశాలలో పోలీస్ శాఖ ద్వారా తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం అధికారులతో కలిసి డ్రగ్స్, గంజాయి నివారణ, టోల్ ఫ్రీ నెంబర్లపై ప్రచార కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అటవీ, వైద్య, విద్య, డ్రగ్స్ కంట్రోల్, వివిధ శాఖల అధికారులు, ఐటిఐ, పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మిక వర్గ ప్రయోజనాలే సిఐటియు లక్ష్యం

- వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఐక్యత-పోరాటం నినాదంతో 1970లో ఆవిర్భవించిన సిఐటియు నేటి వరకు దేశవ్యాప్తంగా కార్మికులందరినీ ఐక్యం చేసి ఉద్యమిస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బస్టాండ్‌లో సిఐటియు జెండాను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకట్రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1970 మే 30వ తేదీన కలకత్తాలో సిఐటియు ఆవిర్భవించిందని మహాసభలు నిర్వహించి ప్రకటించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. అన్ని కార్మిక సంఘాల ఐక్యతాపైపైకి తెచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తుందని తెలియజేశారు. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం కార్మికులు పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందని, ఈ లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులు పెట్టుబడిదారుల బానిసలుగా మారిపోతారని పేర్కొన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జులై 9న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నాయని తెలియజేశారు. ఈ సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ 4 లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, కార్మికుల సామాజిక భద్రత హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని తెలియజేశారు. కార్మికులకు ఎప్పటి వరకు చెల్లిస్తున్న ప్రావిడెంట్ ఫండ్‌లో యాజమాన్యం తమ వాటా చెల్లించకుండా ఉండేందుకు మినహాయింపులు ఇచ్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకంగా, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని తదితర కార్మికులు, ప్రజల ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ, సి.రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.మణి, మున్సిపల్ కార్మికులు చెన్నయ్య, సిద్దయ్య, రవి పాల్గొన్నారు.

సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు

ఒఆర్ సాధనలో జిల్లాకు 18వ స్థానం

- జిల్లా ప్రజా రవాణా అధికారి రాము

బస్సు కండీషన్ పరిశీలించిన సందర్భంగా డిపిటిఒతో డిఎం తదితరులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ డిపో నుంచి బెంగళూరుకు త్వరలో మరో రెండు కొత్త బస్సు సర్వీసులు నడపనున్నట్లు అన్నమయ్య జిల్లా ప్రజా రవాణాధికారి రాము తెలిపారు. ఆర్టీసీ గ్యారేజీ ఆకస్మిక తనిఖీలో భాగంగా డిపిటిఒ శుక్రవారం పీలేరు ఆర్టీసీ డిపోకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు పీలేరు ఆర్టీసీ బస్టాండు నుంచి యలహంక మార్గంలో బెంగళూరుకు ఓ బస్సు బయలుదేరి వెళుతుందని, తిరిగి అది ఉదయం 10 గంటలకు మెజిస్టిక్ నుంచి బయలుదేరి అదే మార్గంలో పీలేరుకు చేరుకుంటుందన్నారు. మరో బస్సు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు పీలేరు నుంచి బెంగళూరుకు బయలుదే రుతుందని, తిరిగి సాయంత్రం 6 గంటలకు బెంగళూరులోని మెజిస్టిక్ నుంచి బయలుదేరి రాత్రి 10:30 గంటలకు పీలేరుకు చేరుకుంటుందన్నారు. ఈ రెండు సర్వీసులకు అనుమతులు అందిన వెంటనే ప్రారంభించడం జరుగుతుందని డిపిటిఒ చెప్పారు. జిల్లాలో నెలవారీ టోల్ ప్లాజాలకు ఆర్టీసీ రూ.37,68,550లు చెల్లిస్తోందని పేర్కొన్నారు. ఒఆర్ సాధనలో జిల్లా రాష్ట్రంలో 18వ స్థానంలో ఉందని, ఎక్కువ ఆదాయం సమకూర్చి జిల్లాను మొదటి పది స్థానాల్లో చేర్చడానికి ఆర్టీసీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 29వ తేదీ నాటికి నెలవారి ఈపికె 39.74 శాతం ఉందని చెప్పారు. పల్లె వెలుగు బస్సు సర్వీసులు నడపడానికి ఒక్కొక్క బస్సుకు రోజువారీ రూ.27,000లు ఖర్చు వస్తుండగా, ఒక్కో పల్లె వెలుగు బస్సు ద్వారా రోజువారీ కేవలం రూ.18 వేలు మాత్రమే ఆదాయం వస్తోందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రోజువారి ఖర్చు రూ.24 వేలు కాగా దానిపై రూ.25 వేలు ఆదాయం వస్తోందన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు డిపిటిఒ తెలియజేశారు. బస్సుల కండిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నిర్మల, సిఐ సుబ్బమ్మ, ఎంఎఫ్ హరినాథరెడ్డి, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పని ఒత్తిడితో స్పృహ తప్పిన శానిటేషన్ కార్యదర్శి

- కమిషనర్ వేధింపులే కారణమని కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న కార్మికులు, సచివాలయ కార్యదర్శులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మితిమీరిన పని ఒత్తిడి కారణంగా పురపాలక కార్యాలయం వద్దే 10వ వార్డు కొలిమివీధి శానిటేషన్ కార్యదర్శి స్పృహ తప్పి పడిపోయిన ఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. ఉదయం ఐదు గంటలకు మాస్టర్ వేయడానికి పురపాలక కార్యాలయానికి వచ్చిన శానిటేషన్ కార్యదర్శి హర్షవర్ధన్ స్పృహ తప్పి ట్రాక్టర్ పైనుంచి కింద పడిపోవడంతో మున్సిపల్ కార్మికులు, సచివాలయ ఉద్యోగులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న హర్షవర్ధన్‌ను మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు, మేనేజర్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితుడు హర్షవర్ధన్ సతీమణి సంధ్య చంటి బిడ్డతో ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ కార్మికులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు వేధింపుల కారణంగానే తన భర్తకు ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కమిషనర్ ప్రతిరోజు తన భర్తను ఏదో ఒక వంకతో దుర్భాషలాడుతూ వేధింపులకు గురి చేసేవాడని, బుల్లెట్ వాహనంపై విధులకు వెళితే సహించేవాడు కాదని, కమిషనర్ వేధింపులు భరించలేకున్నానని తన భర్త పలుమార్లు తనతో చెప్పినట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ కార్మికులు, సచివాలయ కార్యదర్శులు మాట్లాడుతూ 11 మంది సచివాలయ కార్యదర్శి ఉండగా కమిషనర్ వేధింపులు భరించలేక ఆరుగురు సెలవుపై వెళ్లారని, మిగిలిన 5 మంది కార్యదర్శులకు పనిభారం ఎక్కువైందని తెలిపారు. 150 మంది పారిశుధ్య కార్మికులు అవసరం ఉండగా, కేవలం 70 మందితోనే నిర్వహణ చేయిస్తుండడంతో అటు కార్మికులకు, ఇటు శానిటేషన్ కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారిందని వాపోయారు. కమిషనర్ ప్రతి ఒక్కరి పైనా పలు రకాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని, ఈ కమిషనర్ వద్ద తాము విధులు నిర్వహించలేమని, ఈ కమిషనర్ మాకొద్దు బాబోయ్ అంటూ ముక్తకంఠంతో తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మేనేజర్, పురపాలక సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు ఆసుపత్రి వద్దకు చేరుకొని హర్షవర్ధన్ కుటుంబాన్ని పరామర్శించగా కమిషనర్ శ్రీనివాసులు కనీసం తొంగి చూడకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం సిఐటియు ఆధ్వర్యంలో బాధితుడి సతీమణి సంధ్య, మున్సిపల్ కార్మికులు, సచివాలయ కార్యదర్శులుతో కలిసి ఆసుపత్రి వద్ద కమిషనర్ తీరుకు నిరసన తెలిపారు.

క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి: రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల నుంచి జరుగుతున్న వేసవి శిక్షణ క్రీడా కార్యక్రమంలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులకు శుక్రవారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కులు, మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ క్రీడాకా రులను ప్రోత్సహిస్తోందన్నారు. నెల రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులకు వివిధ క్రీడలలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభు త్వం క్రీడాకారులకు విద్య ఉద్యోగాలలో అధిక ప్రాధాన్యత ఇస్తోందని విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రానించి మంచి క్రీడాకా రులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. రాయచోటి ప్రాంతానికి క్రీడలలో మంచి గుర్తింపు ఉందని ఈ ప్రాంతాన్ని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ, ప్రధానోపాధ్యాయులు త్యాగరాజన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో వ్యాయామ ఉపాధ్యాయులు

ఏనుగు దాడిలో ధ్వంసమైన అరటి తోట

పీలేరులో మళ్లీ ఏనుగుల కదలికలు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలో మళ్లీ ఏనుగుల కదలికలు చోటు చేసుకున్నాయని తెలియడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. గురువారం రాత్రి ఓ ఏనుగు మండలంలోని జాండ్ల గ్రామ పరిసర పొలాల్లో ప్రవేశించి గూడరేవుపల్లి మార్గంలో, పీలేరు-తిరుపతి జాతీయ రహదారి దాటి ఎర్రగుంటపల్లి పంచాయతీ పరిసరాల్లో సంచరించినట్లు శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి పీలేరు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎర్రావారిపాలెం మండలం, తలకోన అటవీ ప్రాంతం నుంచి ఓ ఏనుగు తమ సమూహం నుంచి దారి తప్పి ఈ ప్రాంతానికి వచ్చి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం ఎర్రావారిపాలెం మండలంలో ఏనుగు దాడిలో అటవీ సిబ్బంది గాయ పడినట్లు తెలిసింది. పట్టణ శివారులోని బందార్లపల్లిలో కొన్ని రోజుల క్రితం ఏనుగుల దాడిలో ఓ రైతు మృతి చెందిన సంఘటన గుర్తుచేసుకుని, ఈ ఒంటరి ఏనుగు పగ లు ఎక్కడ తలదాచుకుందో తెలియక, అటు రైతులు తమ పొలాల వైపుకు వెళ్లలేక, ప్రజలు తమ అవసరాల కోసం గ్రామీణ మార్గాల్లో సంచరించలేక భయాం దోళనలకు లోనవుతున్నారు. జాండ్ల, గోడరేవుపల్లి పరిసరాల్లో ఏనుగు తిరు గాడిన అడుగుజాడలు కనబడడంతో ఒంటరి ఏనుగు ఆచూకీ కోసం పీలేరు అటవీ శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. కార్యక్రమంలో అటవీ అధికారుల బృందం సబిహాసు ల్తానా, టి.శ్రీనివాసులు, కె.జగదీష్, డి.చంద్రకళ, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

జాన్ల సమీపంలోని వరి పొలాన్ని తొక్కిన ఏనుగు అడుగు జాడలు

చౌకదుకాణాల్లోనే సరుకులు పంపిణీ : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని రేషన్ కార్డుదారులకు జూన్ ఒకటి నుంచి చౌకదుకాణాల్లోనే సరుకులు పంపిణీ చేస్తామని జెసి ఆదర్శ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజు నిర్దేశించిన సమయాల్లో ఉదయం 8 నుండి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు చౌక ధరల దుకాణాలను తెరిచి ఉండాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. ఏక లేదా ద్విసభ్య కార్డులలోని వారి వయస్సు 65 సంవత్సరాలు పైబడి వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ 1 తేదీ నుండి 5వ తేదీ వరకు 12 గంటల నుండి 4 గంటల సమయంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం, చక్కెర, జొన్నలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు చక్కెర అరకిలో రూ.17కు, అంత్యోదయ కార్డుదారులకు చక్కెర ఒకకిలో రూ13.50కు అందజేస్తామని తెలిపారు. కార్డుదారులు తప్పక రసీదు పొందాలన్నారు.

హాకీలో గెలుపొందిన టీమ్‌కు ట్రోఫీని ఇస్తున్న శివారెడ్డి నిర్వాహకులు ప్రసాద్‌రెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-మదనపల్లె

క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్నిస్తాయని హాకీ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులు విచ్చేసిన వక్తలు డాక్టర్ శివారెడ్డి, రోజా లాడ్జి కంభం నాగభూషణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దశ నుండి యోగా పట్ల అవగాహన పెంచుకోవాలని, తద్వారా మానసిక ఉల్లాసంతో పాటు మెదడు అత్యంత పనిచేస్తుందన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. నేడు చిన్న పిల్లలనుండి విద్యార్థులు, యువత సెల్ ఫోన్ల వియోగం ఎక్కువపై శ్రద్ధ పెట్టి భవిష్యత్‌పై కేంద్రీకృతం అవుతున్నారని తెలిపారు. దీన్ని తగ్గించి క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని కోరారు. శుక్రవారం స్థానిక బిటి కళాశాల హాకీ గ్రౌండ్‌లో హాకీ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు, యోగా వల్ల విద్యార్థులకు హాకీ విజేతలకు ట్రోపీలను అందజేశారు. అనంతరం నిర్వాహకులు దివ్యభారతి బుక్ సెంటర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో రాణించే విదంగా ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ బింగి పాండు, డెయిరీ డే ఐస్ క్రీం యజమాని చంద్రారెడ్డి, డాకుమెంట్స్ రైటర్ రెడ్డెప్ప యాదవ్, కోచ్‌లు నౌషాద్, గౌస్‌బాష, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద ముస్లిం బాలురకు ఉచిత వడుగులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ గౌస్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వడుగులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ ముస్లిం బాలురలకు పేదరికంతో కుటుంబ యజమాని బాలురకు వడుగులు చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న వారికి ఉచితంగా వడుగులు చేయించి అవసరమైన మందులతో పాటు ఆహార వస్తువులు ఇస్తానని ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం నందలూరు మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన షేక్ రిహాన్ రాజంపేట మండలం బోయినపల్లి మసీదు వీధికి చెందిన షేక్ సుహేల్, షేక్ ఫిరోజ్, రాజంపేట మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన పటాన్ మొహమ్మద్ అశ్వక్ బాలురకు ఉచితంగా వడుగులు చేయించారు. ఈ సమస్త ప్రధాన కార్యదర్శి ఎస్.జి.ఇ.నాయతుల్లా ఆ కుటుంబ యజమానులకు, బాలురకు ఆహార వస్తువులతో పాటు మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.ఎం.డి.కరీం, పి.మోసిన్ ఖాన్, అడ్వకేట్ ముజఫర్ అహ్మద్, డాక్టర్ ఇక్బాల్, ఎలక్ట్రీషియన్ సయ్యద్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మంచి రోజులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణంలోని మార్కెట్‌కు మంచి రోజులు వచ్చాయని కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్ కుమార్, డొంకా సురేష్, ఎస్ఎండి న్యామతుల్లా, వైసిపి సీనియర్ నాయకులు రెడ్డిమాసి రమేష్ నాయుడు పేర్కొన్నారు. మార్కెట్ అభివృద్ధికి గాను రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి రూ.25 లక్షలు మంజూరు చేశారు. మార్కెట్ లో కాంక్రీట్‌తో ఫ్లోరింగ్ వేయడానికి మున్సిపల్ ఎఇ మల్లేష్‌తో కలిసి కౌన్సిలర్లు అంచనా సిద్ధం చేసేందుకు శుక్రవారం మార్కెట్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం కురిస్తే మార్కెట్లో అడుగు పెట్టడానికి కూడా వీలుండదనిపేర్కొన్నారు. ఇటువంటి దుర్భరమైన పరిస్థితి నుంచి అభివృద్ధి వైపుగా తీసుకెళ్లేందుకు సహకరించిన రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఎంపీ సహకరిస్తానని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అబ్దుల్ మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు పెంచాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పిఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్స్ పెంచాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ ఎపి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి యోగాంధ్ర 2025 క్యాంపెయిన్, పిఎం సూర్య ఘర్, సానుకూల ప్రజా అవగాహన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్ రావు పాల్గొన్నారు. విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్స్ ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలా ఈ పథకంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి గ్రౌండింగ్, సోలార్ పలకలు అమర్చడం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 51 వేల మంది రిజిస్టర్ కాగా, ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని పేర్కొన్నారు. వీరితోపాటు బీసీ రిజిస్ట్రేషన్ పై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. హరితాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాలను విస్తృతం చేయాలని, జిల్లాలో పచ్చదనం పెంపొందేందుకు అటవీ, సంబంధిత శాఖలు కృషి చేయాలన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రజల నిత్యజీవితంలో యోగా కూడా ఒక భాగం అయ్యేలా యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు ట్రైనర్స్‌గా 9025 మంది రిజిస్టర్ చేసుకున్నారని, ఇందులో దాదాపు 4వేల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పట్టణ, మున్సిపల్ ప్రాంతాలలో మాస్టర్ ట్రైనర్ల శిక్షణ బాగా జరుగుతోందని, మండల స్థాయిలో ట్రైనర్ల శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి శిక్షణ కార్యక్రమాలు వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, ఇసుక సరఫరా, ఆసుపత్రులలో వైద్య సేవలు, వైద్య మిత్రుల అందుబాటు, ఆలయాలలో మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, ప్రసాదం నాణ్యత, మునిసిపల్ సేవలలో మెరుగైన స్థాయిలో ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఆయా అంశాలలో ప్రజా సానుకూలతను పెంచేందుకు అధికారులు బాధ్యతా యుతంగా కృషి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గువ్వలచెరువు ఘాట్‌లో ఆకట్టుకుంటున్న జలపాతం

చూపరులను ఆకట్టుకుంటున్న జలపాతం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్‌లోని శివాలయం సమీపంలో రెండవ మలుపు వద్ద గల జలపాతం చూపారులను అకట్టుకుంటుంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల కురిసిన వర్షం గువ్వలచెరువు ఘాట్‌పై భాగంలోని వర్షపు నీరు రెండు కొండల మధ్య కిందికి జలపాతం దూకుతూ చూపులను ఆకట్టుకుంటుంది. ఇలాంటి దృశ్యాలు ఘాట్‌లో జూలై, ఆగస్టు, అక్టోబర్ నెలల్లో వచ్చే తుఫాను వల్ల కురిసే వర్షానికి దర్శనమిచ్చేది. ఈ ఏడాది మే మాసంలోనే దర్శనం ఇవ్వడంతో ప్రజలు కడప-రాయచోటి బెంగళూరు, చిత్తూర్ వెళ్లే ప్రయాణికుల చూపులు ఆకర్షిస్తున్నది స్థానికులు మే మాసంలో పశువులకు గొర్రెలు మేకలకు నీటి కోసం ఇబ్బందులు పడుతూ ఉండేవారని ఈ ఏడాది మే నెల లోనే వర్షాలు కురిసి పశువులకు నీటి సమస్య లేకుండా సకాలంలో పంటలు సాగు చేసుకోవడానికి ప్రకృతి సహరిస్తుందన్నారు

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎపిస్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొలకలచేరువు బ్లోసోమ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 31న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగమేళాలో ఆరాధ్య హెచ్ఆర్ సొల్యూషన్, యాజకీ ఇంజినీరింగ్ లిమిటెడ్, విస్ట్రోన్, ఫాక్స్కాన్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు https://naipunya m. ap.gov.in/user-registration లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు మరిన్ని వివరాలకు 9741432931, 9618655759 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ భాగ్యమ్మ

నిర్విరామంగా కిశోరి వికాసం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్విరామంగా కిశోరి వికాసం కొనసాగుతోందని సిడిపిఓ భాగ్యమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మనంగుట్ట పంచాయతీ, హరిజనవాడ అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక అంశాల నిర్వహణ, డబ్బు పొదుపు చేయడంపై మహిళలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. డబ్బును ఎలా పొదుపు చేయాలి, ఆర్థిక అక్షరాస్యతతో నగదు పొదుపు, సరైన మార్గంలో నగదు ఎలా వినియోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. బడ్జెట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, నెలసరి నగదు పొదుపు, చిన్న లక్ష్యాలను ఎంచుకొని ఎక్కువ డబ్బును పొదుపు చేయడం, అప్పులు క్రెడిట్ కార్డ్, ఇఎంఐ, బ్యాంక్ అకౌంట్, పాస్వర్డ్ స్టోరేజ్, నమ్మదగిన వెబ్ సైట్ల నుంచి ఆన్‌లైన్ షాపింగ్ చేయడం వంటి క్లుప్తంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో సూపర్‌వైజర్ గౌరీదేవి, కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహాశీల్దార్

దళిత గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-పీలేరు

దళితుల సంక్షేమం, దళిత గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని తతహాశీల్దార్ భీమేశ్వరరావు, ఎంపిడిఓ శివశంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తలపుల పంచాయతీ, పెద్ద హరిజనవాడలో పౌరహక్కుల దినం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి శ్మశాన స్థలం, రోడ్డు సౌకర్యం, వీధి లైట్లు కల్పించాలన్నారు. అర్హులకు ఇంటి పట్టాలు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహాశీల్దార్, ఎంపిడిఓ స్పందిస్తూ తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, హౌసింగ్ డిఇ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దోమ కాటు ఆరోగ్యానికి చేటని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ జి.హనీఫ్ బాబా పేర్కొన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. జి.హనీఫ్ బాబా సోములవారి పల్లె,వి వి నగర్ ఈశ్వరరెడ్డి నగర్‌లో డ్రై డే ఫ్రైడే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ దోమల వల్ల వ్యాపించే వ్యాధుల గురించి, వాటి నివారణ చర్యలు, పరిసరాల శుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వర ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఎఎన్ఎంలు ఉమారాణి, వీరమ్మ, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, శివ జ్యోతి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి- వేంపల్లి : ప్రస్తుతం మనం తినే ఆహారం వల్ల చాలామందికి సమస్యలు వస్తున్నాయని కాబట్టి రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలం చేసుకునేందుకు వీలుంటుందని ఎంపిడిఓ కులాయమ్మ పేర్కొన్నారు అంతర్జాతీయ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని నందిపల్లె గ్రామ సమీపంలో ఉన్న అమృత సరోవర్ వద్ద నందిపల్లి, కత్తులూరు గ్రామానికి చెందిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఆసనాలు, ధ్యానం, ప్రాణాయమం మీద యోగా నిపుణులు రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నెల రోజులపాటు యోగాంధ్ర-2025 నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత, దేహ దారుఢ్యం లభిస్తా యని చెప్పారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల పీడీ రాజశేఖర్, ఎపిఓ పార్వతి, నందిపల్లె, కత్తులూరు పంచాయతీ కార్యదర్శులు చరణ్ కుమార్, శివకు మార్, కత్తలూరు సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

'వెలిగల్లు'లో తగ్గుతున్న నీటి మట్టం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని పాపాగ్ననదిపై వెలసిన వెలిగల్లు రిజర్వాయర్‌లో నీటి శాతం తగ్గుముఖం పడుతోంది. నిత్యం రాయచోటి పట్టణంతో పాటు మండల కేంద్రానికి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం 415 మీటర్ల నీరు ఉంది. డ్యాం స్టోరేజీ 2.82 టిఎంసిలు కాగా ప్రాజెక్టు నీటి సామర్థ్యం 420 మీటర్లు. గత ఐదు సంవత్సరాల కాలంలో అనధికారికంగా నీటిని కాలువలకు వదలడం ద్వారా ఎంతో నీటిని వృధా చేశారు. ఇన్‌ఫ్లో నీటి శాతాన్ని కూడా అధికంగా సముద్రంలోకి వదిలేశారు. వెలిగల్లు ప్రాజెక్టు స్టోరేజీ శాతం నీరు పెరిగితే చుట్టు గ్రామాలకు తాగునీటితో పాటు సాగు నీరు కూడా అందించే అవకాశాలు ఉన్నాయి. రాయచోటి నియోజ కవర్గంలోని ఆరు మండలాలకు, గండికోట రిజర్వాయర్ నుంచి మదనపల్లి వరకు రూ.2,200 కోట్లతో టెండర్లు కూడా పూర్తయ్యాయి. జూన్ నెలలో పనులను కూడా ప్రారంభించడానికి రవాణాశాఖ మంత్రి మడిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వాటర్ గ్రిడ్ ద్వారా రూ.460 కోట్లతో తాగు నీటిని శాశ్వత పరిష్కారం దిశగా బాధ్యతలు తీసుకున్నారు. రాబోయే రోజుల

వెలిగల్లు ప్రాజెక్టులో ప్రస్తుత నీటి శాతం

లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎగువ గొట్టివీడు, గోపనపల్లి, చీమలచెరువు పల్లికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించడానికి కూడా మంత్రి సిద్ధంగా ఉన్నారు.

సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న ఖురేషి

ప్రజాశక్తి-నందలూరు

రైతులు సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని భారత నూనె గింజల పరిశోధనా శాస్త్రవేత్త ఖురేషి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని లేబాక, నల్లతిమ్మయ్యగాపల్లి గ్రామాలలో'వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి తోటల పెంపకం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణంరాజు మాట్లాడుతూ మండలంలోని ప్రధాన పంట వరి పైరు గురించి వివిధ రకాల విత్తనాలు నారుమడి పెంపకం, ప్రధాన పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ రైతులందరూ విశిష్ట నమోదు సంఖ్య తీసుకోవాలని, ఇప్పటికీ తీసుకోని వారు త్వరగా నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం వారిచే రైతులకు ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని, రాబోయే ఖరీఫ్ లో ప్రతి రైతు ఈ పంట ద్వారా వారు వేసిన పంటను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి సురేష్ బాబు, వైపి గిరీష్ కుమార్, పామాయిల్ పంట అభివృద్ధి అధికారి కొండారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణం పూర్తయ్యేనా..!

- అర్ధాంతంగా ఆగిన పనులు
- ముళ్ల పొదలు, వ్యర్థాలతో నిండిన వైనం
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న మండల ప్రజలు

పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిన నిర్మాణంలో ఉన్న పార్కు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని చిన్నారులు, వృద్ధులు, యువత అలా ప్రశాంతంగా కొద్దిసేపు మానసిక ఉల్లాసం పొందేందుకు పార్కును ఏర్పాటు చేయాలని 2013లో అప్పటి టిడిపి ప్రభుత్వం గాలివీడు పెద్ద చెరువు వద్ద పార్కు ఏర్పాటుకు నిర్మాణం చేపట్టింది. పార్కు చుట్టూ కంచె ఏర్పాటు చేసి, గేటు నిర్మించారు. కానీ పార్కులో గడ్డిని గానీ, పూల మొక్కలు, చెట్లను ఏర్పాటు చేయలేదు. అనంతరం ఏడాదితో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పార్కు నిర్మాణాన్ని పట్టించుకోలేదు. దీంతో పార్కు ఏర్పాటు స్థలంలో ముళ్ల పొదలు, చెత్తా చెదారంతో నిండిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పార్కును పూర్తి స్థాయి ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం గడిపేందుకు అవకాశం కల్పించాలని ప్రజలు మండల కోరుతున్నారు.

మంచి పని కోసం ప్రోత్సాహం అందిస్తాం

మండలంలో ఏదైనా మంచి పని జరగాలంటే ఆ పనికి పూర్తి సహాయ, సహ కారం అందిస్తాం. పెద్ద చెరువు వద్ద పార్కు కోసం చుట్టూ కంచి కూడా ఏర్పాటు చేశారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పార్కును పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటాం.

-కొండ్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, గాలివీడు

పార్కు ఏర్పాటుకు కృషి

పార్కు పునరుద్ధరణకు కృషి చేస్తాం. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చేయించి మండలంలో ఆహ్లాదకరమైన పార్కును నెలకొల్పుతాం. మండల కేంద్రంలో ఎక్కడ పది మంది కూర్చోవడానికి కూడా స్థలం లేకుండా పోయిందని ఇలా పార్కును ఏర్పాటు చేయడం ద్వారా విశ్రాంతి ఉద్యోగులకు, వృద్ధులకు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం వల్ల ప్రజల ఆరోగ్యాన్ని కూడా కాపాడినవారమవుతాం.

-మోడెం చెన్నయ్య, తెలుగువీర క్షత్రియ సంఘం రాజంపేట కన్వీనర్

విద్యా మాఫియాను అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యా సంవత్సరం 2025-26 ప్రారంభం కాక మునుపే జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు, ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తూ పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న శ్రీ చైతన్య, భాష్యం, నారాయణ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, శ్రీ వేద పాఠశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ శుక్రవారం ఎఇఒ ప్రభాకర్ రెడ్డి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న అనేక పాఠశాలలు, విద్యా ర్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు దండు కుంటూ జిల్లాలో విద్యా మాఫియాను నడిపిస్తున్నారని విమర్శించారు. అందులో ప్రధాన పాత్ర భాష్యం, నారాయణ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, శ్రీవేద విద్యా సంస్థలు వహిస్తు న్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండా ముందస్తు అడ్మిషన్స్ నిర్వహిస్తూ విద్యార్థి తల్లిదండ్రులను కార్పొరేటు ఉచ్చులోకి లాగుతున్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పై తరగతికి అనుమతించాలంటే మొత్తం ఫీజులో 50 శాతం చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేస్తు న్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఒక్కో విద్యార్థికి రూ.8 నుంచి రూ.16 వేల వరకు పాఠ్య పుస్తకాల పేరిట వసూలు చేయడం, విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా విద్యను మాఫియా చేస్తూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, అఖీఫ్ పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్‌లో బి ప్లస్ గ్రేడ్ గుర్తింపు

కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) నుంచి బి ప్లస్ గ్రేడ్ గుర్తింపు పొందిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్ఎఎసి బృందం కళాశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నైపుణ్యం, పరిశోధన, విద్యార్థుల పురోగతి వంటి అంశాలను సమీక్షించి గ్రేడ్‌ను మంజూరు చేసింది. ఈ గుర్తింపు కళాశాల నాణ్యమైన విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లా డుతూ ఈ గుర్తింపు మా అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది కృషి, శ్రమతోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలను సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ విజయంతో కళాశాల విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి.

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని చౌక దుకాణ డీలర్లు కార్డుదారులకు నిత్యవసర సరుకులను సకాలంలో సక్రమంగా పంపిణీ చేయాలని తహాశీల్దార్ హరికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలో తహాశీల్దార్ హరికుమార్, సివిల్ సప్లై డిటి భువనేశ్వరి, ఎలక్షన్ డిటి మౌలాలి మూడు బృందాలుగా ఏర్పడి 39 చౌక దుకాణాలను తనిఖీ చేశారు. ఇపాస్ లైసెన్స్, తూనిక యంత్రాల పనితీరు, ఆథరైజేషన్ అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం నిర్దేశించిన 1 నుంచి15 తేదీ వరకు డీలర్లు చౌక దుకాణాలలోని ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు, సాయంత్రం4 నుంచి 8 గంటల వరకు కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని అన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం చేసి అవకతవకాలకు పాల్పడినా, ఫిర్యాదులు ఆరోపణలు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట విఆర్ఓలు, చౌక దుకాణ డీలర్లు ఉన్నారు.

రేషన్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పిఎఫ్ ఎస్ఐ త్రివేణి

రైల్వే ట్రాక్ దాటడం చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - నందలూరు

ప్రజలు, ప్రయాణికులు రైల్వే ట్రాక్ దాటడం చట్టరీత్యా నేరమని అట్టి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్‌పిఎఫ్ ఎస్ఐ త్రివేణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఇయర్ ఫోన్స్ పెట్టుకొని సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, కొంతమంది సెల్ఫీల మోజులో పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. పశువులు, గొర్రెల యజమానులు ట్రాక్ వెంబడి మేపడం, దాటడం చేయకూడదని సూచిం చారు. అలా చేయడంవల్ల ప్రాణం నష్టం, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని అన్నారు.అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలి పారు. కార్యక్ర మంలో ఆర్ఫిఎఫ్ ఎఎస్ఐ రాధాకృష్ణ, ప్రయాణికులు పాల్గొన్నారు.

కాలేటి వాగును గాలికొదిలేశారు

- వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

ప్రజాశక- చక్రాయపేట

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పులివెం దులపై కక్ష పెంచుకున్నారని, కాలేటి వాగు ప్రాజెక్టును గాలికొదిలేశారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల ఆరోపించారు. శుక్రవారం మండలం లోని కాలేటు వాగు ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 5300 కోట్లతో నిర్మిస్తున్న కాలేటి వాగు ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయంలో పూర్తయిన అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం తమ పేరు వేసుకొని ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. కాలేటి వాగు ప్రాజెక్ట్ గతంలో 0.33 టిఎంసిల నుండి 1.33 టిఎసిలకు సామర్థ్యానికి పెంచి ప్రాజెక్ట్‌ను నిర్మిచారని చెప్పారు. వైఎస్ఆర్ హాయంలో 90 శాతం పనులు పూర్తయినా మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కాలేటి వాగు ప్రాజెక్టు పూర్తయితే చక్రాయపేటతో పాటు కుప్పం ప్రాంత రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఆలయ పునః నిర్మాణానికి రూ. 28 కోట్లు వై.ఎస్.జగన్ మంజూరు చేశారని చెప్పారు. గండి అలయం వైఎస్ఆర్ హాయంలోనే పూర్తయినా చిన్న చిన్న పనులు పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. **పులివెందుల రూరల్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పులివెందులపై కక్ష పెంచుకున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల వైఎస్ఆర్ మెడికల్ కళాశాలను సందర్శించారు. అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు వస్తే వాటిని వెనక్కి పంపిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కూటమి నాయకులు లోకేష్ చెప్పిన విధంగా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఆమె పులివెందుల వైసిపి ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వై.ఎస్.ప్రమీల నివాసానికి వెళ్లి వారితో పులివెందుల విషయాలపై చర్చించారు. **వేంపల్లె :** గత వైసిపి ప్రభుత్వ పాలనలో విద్యా రంగానికి ఎన్నో సంస్కరణలు తెచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ అన్నారు. వేంపల్లెలో అసంపూర్తిగా నిలిచి పోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను, గుంతలు పడ్డ కడప - పులివెందుల ప్రధాన రహదారిని జడ్పి రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్, యువ నాయకుడు రోహన్ నాగిరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఇడుపులపాయ వ్యవసాయక్షేత్రంలోని వైఎస్ఆర్ సమాధికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట వైసిపి నాయకులు రోహన్ నాగిరెడ్డి రామచంద్రారెడ్డి, చక్రాయపేట జడ్పిటిసి బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఈశ్వరరెడ్డి ఉన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : పట్టణంలో పాత రైల్వే గేటు సమీపంలో, తిప్పలూరులోని అనాథాశ్రమాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి స్థానిక వైద్య అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న అర్బన్ ప్రభుత్వ ఆసుపత్రిని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, కమిషనర్ శేషఫణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసులతో హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. స్థానికంగా మందుల కొరత కానీ, ఇతరత్రా ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలపాలని చెప్పారు. ఇక్కడికి వస్తున్న ఒపి పేషెం ట్లకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు తెలిపారు. మెడికల్ క్యాం పులు పెట్టాలని, అందుకు తమ వంతు సహాయం కూడా అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు కొద్ది రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయన అనారోగ్య విషయం తెలుసుకున్న టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ శుక్రవారం పరామర్శించారు. ప్రొద్దుటూరు పట్టణ బిసి నాయకుడిగా, తెలుగు దేశం నాయకుడిగా పాణ్యం సుబ్బరాయుడు అందించిన సేవలను గుర్తు చేశారు. వ్యాధి నుండి త్వరగా కోలుకొని పార్టీకి, పట్టణానికి తన సేవలు అందించాలని ఆయన కోరారు. బిసి నాయకుడు పోలా భాస్కర్, 30వ వార్డు టిడిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

క్రైం కార్నర్

కారు బోల్తా : యువకుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



నవాజ్(ఫైల్ ఫొటో)

కారు బోల్తాపడిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. రాయచోటి పట్టణానికి చెందిన సుహైల్ గత కొన్నిరోజుల క్రితం కువైట్‌కి వెళ్ళాడు. గురువారం అక్కడ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణానికి చెందిన అతని స్నేహితులు మహమ్మద్ అలీఖాన్, ముజిమిల్, ఖాదర్‌ఖాన్, నవాజ్ గురువారం రాత్రి కారులో బెంగళూరు విమానాశ్రయానికి వెళ్లారు. తన స్నేహితుడిని సాదరంగా ఆహ్వానించి ఐదుగురు కలిసి కారులో రాయచోటికి బయలుదేరారు. మార్గమధ్యంలోని కురబలకోట సమీపంలో జంగావారిపల్లి వద్ద కారు అదుపుతప్పి పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బాధితులను కురబలకోట 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నవాజ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన నలుగురు యువకులను ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న మృతుడి, బాధితుల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిం చారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులను పరామర్శించిన మంత్రి 'మండిపల్లి', ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కారు ప్రమాదంలో గాయపడి రాయచోటికి చెందిన యువకుడు మృతి చెందడంతో సమాచారం అందుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వేర్వేరు సమయాల్లో ప్రభుత్వాసుపత్రికి చేరుకొని గాయపడిన బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రమాద ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధితులు కోలుకునే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.